క్లుప్తంగా

మోదకొండమ్మకు పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో మోదకొండమ్మ జాతర మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. కాగా.. జాతర సందర్భంగా గ్రామంలోని కళాబృందాలు ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ, సూరిశెట్టి అప్పల స్వామి, ఆలయ కమిటీ నాయకులు సుబ్బలక్ష్మి, సత్యానందం, కామరాజు, అప్పల రాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన

బిక్కవోలు: డీఎస్‌ఎంవో డాక్టర్ పి.లక్ష్మీదేవి బిక్కవోలు పీహెచ్‌సీని మంగళవారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగం ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆశ వర్కర్లు గ్రామంలో ప్రతి ఇంటా సర్వే చేయాలన్నారు. కుష్ఠు వ్యాధి అనుమానంగా ఉన్నవారికి ఇవ్వవలసిన సలహాలను తెలియజేశారు. బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాజీవ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ నిబంధనల ప్రకారం అందజేయాలని కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారి టి.అన్నామణి అధికారులకు ఆదేశించారు. పెదపూడి సచివాలయాన్ని ఆమె మంగళశారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నామణి మాట్లాడుతూ రికార్డులు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసు చౌదరి, కార్యదర్శి బి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సమీకృత సాగుతో అధిక దిగుబడులు

పెదపూడి: రైతులు సమీకృత వ్యవసాయం చేయడంతో తక్కువ పెట్టుబడికి అధిక దిగుబడులు సాధించవచ్చని మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసు తెలిపారు. ఆయన కైకవోలు గ్రామంలోని సమీకృత వ్యవసాయం చేస్తున్న రైతు పొలాన్ని ఆయన, కాకినాడ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పద్మశ్రీ, ఏవో మణిదీప్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు సమీకృత వ్యవసాయానికి సంబంధించిన సూచనలు, సలహాలు రైతులకు అందించారు. ఒక ఎకరం పొలంలో ఫిష్ కల్చర్, వరి, కోళ్ల ఫారం, కూరగాయల సాగు చేపట్టవచ్చని రైతులకు సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.10వేల జరిమానా

రంగంపేట: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి రూ. పది వేల జరిమానా విధించారని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన సేవ సత్యనారాయణ మద్యం సేవించి మోటార్ సైకిల్ నడుపుతూ వాహనాలు తనిఖీలో భాగంగా పట్టుపడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసి పెద్దాపురం ఏజేఎఫ్‌సీ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి జి.బుల్లమ్మ సేవ సత్యనారాయణకు రూ. 10 వేలు జరిమానా విధించారని తెలిపారు.

కట్నం కోసం వేధింపులు

రంగంపేట: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ వివాహిత ఫిర్యాదు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెద దొడ్డిగుంట గ్రామానికి చెందిన గంధం మల్లేశ్వరి కోటపాడు గ్రామంలో ఉన్న తన భర్త గంధం శ్రీను, మావయ్య గంధం కాపు, అత్తయ్య గంధం పార్వతి కలసి అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధిస్తున్నారని పేర్కొంది. భర్త శ్రీను మద్యం సేవించి వచ్చి రోజూ తనను చిత్రహింసలకు గురి చేస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు ఇచ్చిందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చోరీ కేసులో ఏడాది జైలు

రాజానగరం: స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులోని ఒక ఇంటిలో దొంగతనం చేసిన కొండేటి నాగసాయికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.శ్రీలక్ష్మి మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై వై.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమూరులోని నండూరి భాస్కరరావు ఇంట్లో 2020 మార్చిలో దొంగతనం జరిగింది. బంగారు, వెండి వస్తువుల తోపాటు కొంత నగదును దొంగలు అపహరించారు. దర్యాప్తు అనంతరం కొండేటి నాగసాయిని అరెస్టు చేసి, అప్పటి ఎస్సై నాగబాబు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారన్నారు. విజయ్‌కుమార్ ఏపీపీగా వాదించారు.

బైక్‌ను లారీ ఢీకొని వ్యక్తి మృతి

రంగంపేట: పల్సర్ బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన దేవరకొండ వెంకటేశ్వర్లు (37) కానవరం విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడని మంగళవారం మధ్యాహ్నం విధులకు హాజరయ్యేందుకు జె.తిమ్మాపురంలో ఉన్న తన బావ కావడి వెంకటరమణ ఇంటి నుంచి పల్సర్‌బైక్ పై బయలుదేరాడన్నారు. ఏడీబీ రోడ్డులో కార్గిల్ ఫ్యాక్టరీ దాటిన తరువాత ఎదురుగా వస్తున్న ఇసుకలారీ బలంగా ఢీకొట్టిందని చెప్పారు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందాడని చెప్పారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడు బావ గాడ దొరబ్బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రిజిస్ట్రేషన్ హక్కు కల్పించారు



ఎప్పుడో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలం. దానికి పట్టా ఉన్నాగానీ రిజిస్ట్రేషన్ సదుపాయం ఉండదు. పక్కా ఇల్లు కట్టుకుందామంటే బ్యాంకు లోను కూడా మంజూరు చేయరు. ఈ సమయంలో ప్రభుత్వం ఓటీఎస్ విధానంతో నివాసం ఉంటున్న స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి, పూర్తి హక్కు పత్రం ఇస్తుందని మా వలంటీరు చెప్పడంతో దరఖాస్తు చేశాను. దీంతో నాకు రిజిస్ట్రేషన్‌తో పూర్తి హక్కు వచ్చింది.

– గుత్తుల సుశీల, పల్ల కడియం, రాజానగరం మండలం

మ్యారేజ్ సర్టిఫికెట్ వచ్చింది



మ్యారేజ్ సర్టిఫికెట్‌ను మంజూరు చేయించడంలో మా వలంటీర్ పాత్ర ఎంతో ఉంది. పెళ్లి అయిన తరువాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పోయి, దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇది అయ్యే పని కాదని ఊరుకున్నాం. కానీ దాని అవసరం మాకు ఉందని గ్రహించిన మా వలంటీర్ సచివాలయం ద్వారా దరఖాస్తు చేయించి, జగనన్న సురక్ష కార్యక్రమంలో వెంటనే మంజూరు చేయించారు.

– కాళ్లకూరి మణికంఠ, పల్ల కడియం, రాజానగరం మండలం

ఫ్యామిలీ సర్టిఫికెట్ మంజూరు



సాధారణంగా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాన్ని (ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్) రెవెన్యూ కార్యాలయం నుంచి పొందాలంటే కాళ్లు అరిగిపోతాయి. కానీ జగనన్న సురక్షలో మా వలంటీర్ చొరవతో రోజుల వ్యవధిలోనే పొందగలిగాను. ఇదే విధంగా వలంటీర్లు ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలు అనేక సేవలు పొందుతున్నారు.

– యార్లగడ్డ లాజరు, పల్లకడియం, రాజానగరం మండలం

ప్రశంసనీయం.. ప్రజోపయోగం

ప్రజల ముంగిటకు ప్రభుత్వ పాలన చేరవేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీరు వ్యవస్థ సత్ఫలితాలిస్తోంది. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీరును నియమించగా ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా వారు అందిస్తున్న సేవలు ప్రశంసలు అందుకుంటున్నాయి. నామమాత్రపు పారితోషికంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాలపై తమను ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తున్నారని లబ్ధిదారులు అంటున్నారు. సంక్షేమం ఒక జాతరలా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో ఈ వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేసిందని చెబుతున్నారు. వారే లేకపోతే ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు తమ దరికి సక్రమంగా చేరేవి కావని అంటున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో మానవత్వంతో వారు అందించిన సేవలకు విలువ కట్టలేమని చెప్పారు. తమ కుటుంబంలో ఒకరుగా మారిపోయి ఆత్మీయులయ్యారని లబ్ధిదారులు ముక్తకంఠంతో చెబుతున్నారు.

– పెదపూడి/రాజానగరం

విలువ కట్టలేం



నా పేరు కొప్పిశెట్టి బాబురావు నేను బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామంలోని సచివాలయం 2లో నివాసం ఉంటున్నాను. మా వలంటీరు కరుపోతు నవీన్ కుమార్. కరోనా సమయంలో ఉన్నప్పుడు మా కుటుంబానికి ఎవరూ సహాయం అందించలేని సమయంలో వలంటీరు అందించిన సేవను ఎప్పటికీ మరచిపోలేం. మాకు నిత్యావసరాలు తెచ్చి ఇచ్చేవాడు. అతని సేవలను విలువ కట్టలేం.

– కొప్పిశెట్టి బాబురావు, ఊలపల్లి, బిక్కవోలు మండలం

వలంటీర్ల సేవలు అభినందనీయం



ఒకటో తేది ఉదయాన్నే ఇంటి వద్దకు వచ్చి సామాజిక పింఛన్ అందించి తమ కుటుంబాల్లో వెలుగులు, ఆనందం నింపుతున్న వలంటీర్ల సేవలు అభినందనీయం. నేను ఐదేళ్లుగా వృద్ధాప్య పింఛన్ అందుకుంటున్నాను. గతంలో పింఛన్‌కోసం గ్రామ పంచాయతీకి వెళ్లి పడిగాపులు కాసేవాణ్ణి. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థతో పింఛన్ ఇంటికే తెచ్చి ఇస్తున్నారు. నా కుమారుడు వీరబాబు దివ్యాంగ పింఛన్ అందుకుంటున్నాడు. ఇతర సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే తెచ్చి అందివ్వడం చాలా సంతోషం ఉంది. వలంటీర్ వ్యవస్థతో నాలాంటి ఆసరాలేని కుటుంబానికి ఎంతో మేలు.

– పలివెల అప్పలరాజు, జి.మామిడాడ గ్రామం

పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలి



రంగంపేట సెంటర్‌లో ఏడీబీ రోడ్డుపై మానవహారం నిర్వహిస్తున్న వలంటీర్లు



కొంకుదురులో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న వలంటీర్లు



రంగంపేట పోలీస్ స్టేషన్‌లో పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



కూనవరంలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



రాజానగరంలో వలంటీర్ల మానవహారం

- రంగంపేటలో వలంటీర్ల నిరసన, మానవహారం
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

రంగంపేట: తమపై నీచపు ఆరోపణలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే తగిన గుణపాఠం చెబుతామని గ్రామ వలంటీర్లు హెచ్చరించారు. ఏలూరు సభలో గ్రామ వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల వలంటీర్లు మండల కేంద్రమైన రంగంపేట చేరుకుని స్థానిక దేవిగుడి సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో పాదయాత్ర నిర్వహించి ఏడీబీ రోడ్డుపై మానవహారం నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పవన్ కల్యాణ్‌పై ఎస్సై టి.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు.

పవన్ దిష్టిబొమ్మకు శవయాత్ర

బిక్కవోలు: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం కొంకుదురు గ్రామంలో పవన్‌కల్యాణ్ డౌన్ డౌన్..అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందని, అటువంటి వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా పవన్ కల్యాణ్ చిత్రీకరించడం దారుణమన్నారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దగ్ధం చేశారు. కొంకుదురు సచివాలయం1, 2 వలంటర్లు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

అనపర్తి: వలంటీర్ వ్యవస్థను కించపరుస్తూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆయన వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సీతానగరం: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కూనవరం వలంటీర్లు అన్నారు. గ్రామ సచివాలయం వద్ద దూలం శ్రీనివాస్, కె.బుజ్జి, ఎస్.నాగలక్ష్మి, ఎస్.సుబ్బలక్ష్మి, ఎస్.సతీష్, బి.సాయిబాబు, టి.రమ్య నిరసన తెలిపారు. పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు

రాజానగరంలో మానవహారం

రాజానగరం: పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా రాజానగరంలో వలంటీర్లు నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై వైఎస్సార్ జంక్షన్ నుంచి స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. అనంతరం మానవ హారంగా ఏర్పడి పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మధురపూడి: కోరుకొండలో వలంటీర్లు భారీ నిరసన ర్యాలీ చేశారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన ర్యాలీ కొండ రోడ్డు, పాత బజార్, పోలీసు స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, సచివాలయం మీదుగా బస్టాండ్ వరకూ జరిగింది. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు చేశారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కందికట్ల జయకర్, వలంటీర్లు షాలినీ, సుధ, ప్రియాంక, శ్యామల, సత్యసాయి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పశ్చిమగానుగూడెంలో గడపగడపకూ



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశ్చిమగానుగూడెం అభివృద్ధికి రూ. 2.70 కోట్లు కేటాయించామన్నారు. శివారు ప్రాంతంలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ బూలోకమ్మ గుడి ఏరియా, రాధాకృష్ణ నగర్, సుంకర చంద్రరావు కాలనీలో 400 గడపలు తిరిగారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కోకన్వీనర్ గణేశుల నాగేశ్వరరావు, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, నాయకులు అడపా బాబీ, మేడిశెట్టి రామచంద్రరావు, బత్తిన వెంకట్రావు, వెలిసెట్టి స్వామి, మేడిశెట్టి శివరామకృష్ణ, ఖండవల్లి పెద్దిరాజు, పిల్లి సురేష్, మామిడిపల్లి సతీష్, సచివాలయం సెక్రటరీ మదార్ బీబీ పాల్గొన్నారు. కాగా.. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి బుచ్చెంపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని కన్వీనర్ అడపా కనకరాజు తెలిపారు.

ప్రజాసాధికారతే లక్ష్యంగా పథకాలు



సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రజాసాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కుతుకులూరులో మంగళవారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతీ గడపలోనూ సంక్షేమ దివ్వెలు వెలుగుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిని లబ్ధిని వివరించి దానికి సంబంధించిన కరపత్రాన్ని అందజేశారు. సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సత్తి దొరయ్యరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

అనపర్తి: మహిళల స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా 87 డ్వాక్రా సంఘాలకు సంబంధించి 703 మంది లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా మంజూరైన రూ.9,08,000 విలువైన చెక్కును ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు బిక్కవోలు మండల కాపవరంలో 200 ఎకరాలు స్థల సేకరణ చేశామని, దీనిపై మాజీ ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. నాయకులు సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, చిర్ల వీర్రాఘవరెడ్డి, జె.సీతామహాలక్ష్మి మాట్లాడారు.

సినిమా బృందం సందడి

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం అన్నపూర్ణ ఫొటో స్టుడియో చిత్రబృందం సందడి చేసింది. విద్యార్థినులతో ముచ్చటించింది.

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి

పెదపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేసి, వారు అన్ని పథకాల లబ్ధి పొందేలా చూడాలని అధికారులకు కాకినాడ డీఎల్‌పీఓ టి.అన్నామణి ఆదేశించారు. జి.మామిడాడ గ్రామంలో సచివాలయం-4లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామసభ సర్పంచ్ లంక మున్ని అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం 765 ధ్రువ పత్రాలను ప్రజలకు ఆమె పంపిణీ చేశారు. ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీపీ కేతా తులసి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకట పద్మావతి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమానికి అర్హతే ప్రామాణికం

రంగంపేట: ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హతే ప్రామాణికమని, టీడీపీ మాదిరిగా లబ్ధిదారుల ఎంపికలో పార్టీలను చూడటం లేదని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న అన్నారు. మంగళవారం దొడ్డిగుంట సచివాలయం వద్ద అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 1,250 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కారి సంజీవరావు, ఎంపీటీసీ సభ్యురాలు మడికి లక్ష్మి, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, ఏఓ కె. శ్రీనివాసరావు, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు, పార్టీ కన్వీనర్ తోట వెంకటేశ్వరరావు, కార్యదర్శి మణికుమార్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

బిక్కవోలు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరరికీ నూరు శాతం మేలు జరుగుతోందని సర్పంచ్ బుంగా రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని బలభద్రపురం గ్రామంలోలబ్ధిదారులకు కుల,ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, ఎంపీడీవో ఝాన్సీ, డీటీ కృష్ణ పాల్గొన్నారు. కొంకుదురులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ, తహసీల్దార్ పోసిబాబు, ఈవోపీఆర్డీ భవాని పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధి

రాజానగరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని సూర్యారావుపేటలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ కె.మాధవీలత హాజరయ్యారు.

కలెక్టర్ చొరవ అభినందనీయం

నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించడంలో కలెక్టర్ మాధవీలత చూపుతున్న చొరవ అభినందనీయమని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. జీఎస్‌ఎల్ నుంచి రాజానగరం పంచాయతీ పన్నులు రూ. 2.38 కోట్లు వసూలు చేయడంలోను చురుకైన పాత్ర వహించారన్నారు. రాజానగరం ప్రజలకు గోదావరి జలాలను సరఫరా చేసేందుకు ఈనెల 29న బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. తహసీల్దారు పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.రామారావు, కార్యదర్శి ఎం.ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సర్పంచ్ కుందేటి ప్రసాద్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, పలివెల స్వామి, వేమగిరి కృష్ణ, కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి, ఆకుల శ్రీను, సంగీత ప్రసాద్ పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం-2లో తహసీల్దార్ సత్యనారాయణరాజు, కాటవరంలో ఎంపీడీవో కె.రమేష్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలం రాఘవపురంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో రాఘవపురంలో, గాదరాడ-2 సచివాలయం పరిధిలో తహసీల్దార్ పాపారావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కోకన్వీనర్ గణేశుల పోసి, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, పార్టీ నాయకులు అడపా బాబీ, అరిబోలు చినబాబు పాల్గొన్నారు.